సంక్షేమమే లక్ష్యంగా జగనన్న పాలన

● ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్ధారెడ్డి

ఎన్పీకుంట: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని ధనియానిచెరువు సచివాలయం పరిధిలోని గోవిందురాజులపల్లి, ముండ్లవారిపల్లి గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులతో కలిసి 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. తొలుత గ్రామానికి చేరుకున్న ఎమ్మెల్యేను స్థానిక నాయకులు గజమాలలతో సత్కరించారు. మహిళలు హారతులు పట్టి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, పొజిషన్ సర్టిఫికెట్ల మంజూరు, సాగు భూములకు పట్టాల మంజూరు తదితర సమస్యలను పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారికి ఆ పథకం యొక్క పూర్తి సమాచారాన్ని వివరించాలన్నారు. దగ్గరుండి పథకాలకు దరఖాస్తు చేయించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించే బాధ్యత సచివాలయ సిబ్బందిపై ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి చొరవతో సీసీ రోడ్లు ఏర్పాటు చేయించారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పాలన అందిస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి అందరి మన్ననలు పొందుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి సక్రమంగా అమలు చేస్తున్న ఘనత మన ముఖ్యమంత్రి జగనన్నకే దక్కుతుందన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్న ప్రభుత్వానికి అన్ని వర్గాల ప్రజలు అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఈటె రాము, సర్పంచ్ దిల్షాద్, వైస్ ఎంపీపీ కేశవరడ్డి, ఎంపీడీఓ ఆదినారాయణ, ఎంపీటీసీలు కొత్త రంగారెడ్డి, తిమ్మారెడ్డి, సర్పంచులు రామాంజులురెడ్డి, విష్ణుమూర్తి, ఉప సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్ బయారెడ్డి, కృష్ణారెడ్డి, ఓబుళరెడ్డి, మాజీ మార్కెట్‌యార్డ్ చైర్మన్ రాఘవయ్య, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ జయరామిరెడ్డి, స్థానిక నాయకులు అల్లాబక్షు, ఓబులరెడ్డి, తిరుమల నాయుడు, హరిహర ప్రసాద్‌రెడ్డి, గోవిందు నాయక్, శ్రీరాములు, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.


మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి


ప్రమాణ స్వీకారం చేస్తున్న పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి పాలక మండలి సభ్యులు

ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

నల్లచెరువు: మండల పరిధిలోని పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయ నూతన పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం సోమవారం అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి ఆలయాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ప్రాంగణంలో గ్రానైట్‌తో ప్రత్యేక నిర్మాణాలు చేపడుతామన్నారు. చైర్మన్ దేవరింటి భాస్కర్‌రెడ్డి, సభ్యులు సూర్యనారాయణ, జానకి, అంజినమ్మ, అరుణమ్మ, ఉమాదేవి, గోవిందురెడ్డి, అఫిసియో సభ్యుడిగా ఎన్నికైన ఆంజనేయదాస్‌తో ఆలయ ఈఓ రామాంజినేయులు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన పాలక మండలి సభ్యులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సూచనలతో ఆలయాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచులు పంచరత్నమ్మ, యూసుఫ్, శ్రీనాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ అనిత, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథనాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ ముస్తఫా, నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, మాజీ టెంపుల్ చైర్మెన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచులు నరసింహారెడ్డి, నగేష్, డీజీ ఈశ్వర్‌రెడ్డి, రామాంజీ, పెద్దమౌలా, డాక్టర్ శంకర, రఘునాథ్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, సోమిరెడ్డి పాల్గొన్నారు.

నూతన ప్రెస్ క్లబ్ ప్రారంభం

నల్లచెరువు: మండల కేంద్రంలో సోమవారం నూతన ప్రెస్ క్లబ్‌ను ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాత్రికేయుల సంక్షేమానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, సర్పంచ్ పంచరత్నమ్మ, మాజీ సర్పంచులు అక్బర్, నరసింహారెడ్డి, రవికుమార్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, నాయకులు బసిరెడ్డి విశ్వనాథరెడ్డి, హైదర్‌వలి, హరినాథ్‌రెడ్డి, హైటెక్ రమణ, వెంకటరెడ్డి, నరసింహారెడ్డి, రాజప్ప, హరి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

తనకల్లు: కొర్తికోట సచివాలయం పరిధిలోని గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అధికారులు, స్థానిక సంస్థల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

చీకిరేవులపల్లి పంచాయతీలో..

అమడగూరు: చీకిరేవులపల్లి పంచాయతీలోని రెడ్డివారిపల్లి, శీతిరెడ్డిపల్లి, చీకిరేవులపల్లి, నల్లగుట్లపల్లి, గంగిరెడ్డిపల్లి, బలకవారిపల్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు ఓ ప్రకటనలో తెలిపారు.

నేడు కదిరిలో జాబ్‌మేళా

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మినీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.స్మిత సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా ప్రారంభం అవుతుందన్నారు. వివిధ కంపెనీల్లో ఖాళీగా ఉన్న 160 పోస్టులకు భర్తీ చేయనున్నారు.

బీసీ సమస్యల పరిష్కారానికి కృషి


బత్తల హరిప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఓఆర్‌సీసీఐ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాజంపేట రమణ

కదిరి అర్బన్: బీసీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఓడ్ రాజ్‌పుత్ కౌన్సిల్ కమిటీ ఆఫ్ ఇండియా (ఓఆర్‌సీసీఐ) రాష్ట్ర గౌరవాధ్యక్షుడు రాజంపేట రమణ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరిప్రసాద్‌ను కలసి బీసీలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు బాహుద్దీన్, మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ, నాయకులు గంగాధర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం పెంచాలి

బత్తలపల్లి: మండలంలోని రాఘవంపల్లి నుంచి గంటాపురం వరకూ బైపాస్ రోడ్డుకు, బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకూ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న తమకు ప్రభుత్వం నష్ట పరిహారం పెంచాలని రైతులు కోరారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో వారు తహసీల్దార్ యుగేశ్వరి, ఎంపీడీఓ సాయిమనోహర్‌కు వినతిపత్రం అందజేశారు. 2013 సంవత్సర భూసేకరణ చట్టాన్ని అమలు చేసి, భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలన్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తహసీల్దార్ సమాధానమిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, మండల కమిటి నాయకులు జేవీ నాయుడు, జె.రామచంద్ర, మండల కార్యదర్శి పోతలయ్య, రైతులు నాగభూషణ, అప్పస్వామి, క్రిష్టయ్య, ఈశ్వరయ్య, జయరాములు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


క్రీడాకారులను అభినందిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి సీనియర్ కబడ్డీ పోటీలకు డిగ్రీ విద్యార్థులు ఎంపిక కావడం హర్షణీయమని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈనెల 21న బత్తలపల్లి ఆర్డీటీ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లా కబడ్డీ జట్ల ఎంపిక పోటీల్లో శ్రీనివాసులు, రాజు ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టులో స్థానం సాధించారన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ విశాఖపట్నం అంకుపాలెంలో జరిగే 70వ అంతరాష్ట్ర సీనియర్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారన్నారు. పీడీ ఆనంద్, అధ్యాపకులు క్రీడాకారులను అభినందించారు.

గదులకు మరమ్మతులు చేయించాలి

ఓడీ చెరువు: మండలంలోని రామిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలోని గదులకు మరమ్మతులు చేయించాలని ఉపాధ్యాయుడు అంజిన్ రెడ్డి, స్థానిక ప్రజలతో కలిసి ఎంపీడీఓ పోలప్పకు వినతిపత్రం అందజేశారు. ఆరు సంవత్సరాల క్రితం నిర్మించిన పాఠశాల భవనానికి అప్పట్లో నిధులు విడుదల చేయకపోవడంతో అసంపూర్తిగా మిగిలిపోయిందన్నారు. ప్రస్తుతం మండల గ్రాంటు కింద చిన్నచిన్న మరమ్మతులు చేయించాలని కోరారు. ఆర్‌సీపీ నాయకులు మున్నా, రాజమ్మ పాల్గొన్నారు.

వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం


కదిరి టౌన్: కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

కదిరి టౌన్/తాడిమర్రి/ధర్మవరం అర్బన్: కదిరి, తాడిమర్రి, ధర్మవరంలో సోమవారం వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం జరుపుకున్నారు. తొలుత ఆలయాల్లో వాసవీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల ఆర్యవైశ్య మహిళా సంఘాల ఆధ్వర్యంలో కలశాలతో భారీ ఊరేగింపు చేపట్టారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో అమ్మవారిని కొలువుదీర్చి, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు.

మహిళకు తీవ్ర గాయాలు

తనకల్లు: మండల పరిధిలోని మండ్లిపల్లి వద్ద బైక్ అదుపు తప్పిన ఘటనలో లక్ష్మీదేవి అనే మహిళ గాయపడింది. స్థానికులు తెలిపిన వివరాలు.. కడపకు చెందిన లక్ష్మీదేవి తన బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంలో కొక్కంటి క్రాస్ వైపునకు వెళ్తున్నారు. గ్రామం సమీపంలోకి వెళ్లగానే బైక్ అదుపు తప్పడంతో కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఆమెకు తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన కొందరు యువకులు లక్ష్మీదేవిని చికిత్స కోసం తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అయితే అధిక రక్తస్రావం కావడంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం కదిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

రేపు కాయగూరల మార్కెట్‌లో షెడ్లకు వేలం

ధర్మవరం: చిరు వ్యాపారులకు కోసం మున్సిపాలిటీ స్వంత ఖర్చులతో షెడ్‌లను నిర్మించి తక్కువ అద్దెకు ఇవ్వడం జరుగుతోందని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. నూతన కాయగూరల మార్కెట్ పనులను ఏడాది లోపు పూర్తి చేసి, వచ్చే నెల మొదటి వారంలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. మార్కెట్ సముదాయంలో గతంలో భవన సముదాయంలో గదులను గుడ్‌విల్ పద్ధతిలో దుకాణాలు కేటాయించడం జరిగిందన్నారు. నూతనంగా నిర్మించిన మొత్తం 36 షెడ్‌లను ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న చిరు వ్యాపారులు రూ.10 వేల డీడీని మున్సిపల్ కమిషనర్ పేరిట తీసుకుని రూ.75 వేలు విలువజేసే సాల్వెన్సీని పొంది వేలం పాటలో పాల్గొనాలన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

రాష్ట్ర ప్రభుత్వం ప్లాస్టిక్ ఫ్లెక్సీలను నిషేధిస్తూ జీఓ నంబర్ 75 ద్వారా ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఫ్లెక్సీల తయారీదారులు జనవరి 26వ తేదీలోపు వారి ఉద్ద ఉన్న ఫ్లెక్సీలు తయారు చేసే సామగ్రిని తీసివేయాలన్నారు. కేవలం పర్యావరణానికి హాని కల్గించని క్లాత్ ఫ్లెక్సీలను మాత్రమే అనుమతించడం జరుగుతుందన్నారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీలు తయారు చేసే వారిపై జరిమానాలు విధించే అధికారం కమిషనర్, శానిటరి ఇన్‌స్పెక్టర్లకు కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ మధుసూధన్‌రెడ్డి, ఆర్‌ఓ ఆనంద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

అన్ని హంగులతో పాఠశాలల అభివృద్ధి

ఓడీ చెరువు: నాడు-నేడు కార్యక్రమం కింద సుమారు రూ.60 వేల కోట్లతో అన్ని హంగులతో పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను అందించేందుకు విద్యార్థులకు ట్యాబులు అందజేయడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు సీఎం కృషి చేస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ తరపున బరిలో ఉన్న ఎమ్మెల్సీ అభ్యర్థులు ఎం.వీ.రామచంద్రారెడ్డి, వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అంతకుముందు ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీఎఫ్ స్టేట్ ఆడిట్ మెంబర్ రాజేష్, మండల అధ్యక్షుడు శ్రీనివాసులు, సెక్రటరీ భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, గౌరిశంకర్‌రెడ్డి, మనోహన్ రెడ్డి, మధుసూధనరెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, నిర్మల, సునీత, శ్రావణి, హారూన్‌బాషా, షకూర్‌ఖాన్, జిలాన్, అంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌టీఎఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

హైవే పక్కన దుకాణాలు తొలగించాలి

కనగానపల్లి: అక్రమంగా డీజిల్ విక్రయించేందుకు దాదులూరు కొట్టాల సమీపంలో జాతీయ రహదారి (హైవే) పక్కన ఏర్పాటు చేసుకున్న దుకాణాలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు, స్థానికులు అధికారులను కోరారు. దీనిపై సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో విన్నవించారు. వారు మాట్లాడుతూ జాతీయ రహదారి పక్కన దుకాణాలు ఏర్పాటు చేసుకున్న కొందరు వ్యాపారులు రహదారి మీదుగా వెళ్లే లారీల నుంచి డీజిల్‌ను అక్రమ విక్రయాలు కొనసాగిస్తున్నారు. రహదారిపైనే లారీ ఆపడం వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరుతున్నాయన్నారు. హైవే పక్కన దుకాణాలు వేసుకొని అక్రమంగా డీజిల్ విక్రయిస్తున్న వారిపై తగు చర్యలు తీసుకొని, వాటిని ఖాళీ చేయించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కదిరప్ప, సుధాకర్, గ్రామస్తులు శివారెడ్డి, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

అనుమానితుల సమాచారం ఇవ్వండి

ధర్మవరం: రైళ్లలో ఎవరైనా అనుమానితులు సంచరిస్తూ ఉంటే వెంటనే జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించాలని రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ గోపికుమార్ తెలిపారు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమవారం వెండర్స్‌తో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ ఫ్లాట్‌ఫారంలో గాని, రైళ్లలో గాని అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అప్పుడే నేరాలు జరగకుండా అరికట్టవచ్చన్నారు. రైళ్లలో టీ, టిఫిన్, భోజనం, నీళ్ల అందించే వెండర్స్ కూడా ప్రయాణికులతో మర్యాదగా నడుచుకోవాలన్నారు. గౌరవంగా పలకరించాలని సూచించారు.


మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్‌ఐ గోపికుమార్

కార్యక్రమంలో రైల్వే జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుళ్లు విజయ్‌కుమార్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెరగాలి

గాండ్లపెంట: ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచాలని ఏపీఓ మంజునాథ క్షేత్ర, సాంకేతిక సహాయకులను సూచించారు. సోమవారం మండల పరిధిలోని తుమ్మలబైలు పెద్దతండా పంచాయతీ గరుగుతండా సమీపంలోని కొండ ప్రాంతంలో జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల మస్టర్లు, ట్రెంచ్ పనులను పరిశీలించారు. ఉపాధి కార్డు ఉన్న ప్రతి కూలీ పనులకు వచ్చే విధంగా అవగాహన కల్పించాలన్నారు. మండల వ్యాప్తంగా 12 గ్రామ పంచాయతీల్లో 1,018 మంది కూలీలు ఆయా గ్రామాల సమీపంలోని కొండ ప్రాంతాల్లో కందకాల పనులు చేస్తున్నారని పేర్కొన్నారు. పనులు చేసిన కూలీలకు సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నామన్నారు.


గరుగుతండా సమీపంలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఏపీఓ మంజునాథ

రేపు చేపల చెరువుల వేలం

నల్లమాడ: యర్రవంకపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని యర్రకుంట, దిగువ చెరువులకు ఈనెల 25వ తేదీన ఉదయం 11 గంటలకు వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి త్రివేణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని సూచించారు.

ఎగ్జామ్ ప్యాడ్‌ల పంపిణీ

పుట్టపర్తి అర్బన్: మండల పరిధిలోని పెడపల్లి, నిడిమామిడి ఉన్నత పాఠశాలలకు చెందిన సుమారు 165 మంది విద్యార్థులకు సత్యసాయి భక్తులు శ్రీశైలం గంగాధర్‌గౌడ్, విష్ణువర్ధన్ సోమవారం ఎగ్జామ్ ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు రామచంద్రారెడ్డి, అబ్దుల్ రహీం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు సిమెంట్ పంపిణీ

గాండ్లపెంట: మండల పరిధిలోని గాండ్లపెంట, కోట్లపల్లి గ్రామాల్లో పీఎంఏవై పథకం కింద పక్కా గృహాలు మంజూరైన లబ్ధిదారులకు హౌసింగ్ ఏఈ చంద్రారెడ్డి సోమవారం 40 చొప్పున సిమెంట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పునాదులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు సిమెంటు అందించామన్నారు. బిల్లుల మంజూరుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించామన్నారు. మండల వ్యాప్తంగా పీఎంఏవై పథకం కింద 110 గృహాలు మంజూరైనట్లు తెలిపారు. వీరిలో పునాదులు పూర్తి చేసుకున్న 25 మంది లబ్ధిదారులకు సిమెంటు అందజేశామన్నారు.

కొనసాగుతున్న ఆలయ వార్షికోత్సవాలు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వర స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవం, మాఘ మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు వివిధ హోమాలు, కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి పూజ, గంగపూజ, పంచామృత, రుద్రాభిషేకాలు, రుద్రహోమం, మన్యుసూక్తహోమం, స్వామి వారి అభిషేకాలు, మంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ శాశ్వత ధర్మకర్త, ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్ బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్, ఉప సర్పంచ్ గోపీనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్, కాశప్ప పాల్గొన్నారు.

తపాలా బీమా పథకాలపై నేడు అవగాహన

గాండ్లపెంట: స్థానిక ఉప తపాలా కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై మంగళవారం కదిరి డివిజన్ తపాలా ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలోఅవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉప తపాలా పోస్ట్ మాస్టర్ రామ్మోహన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. టాటా ఏఐజీ బీమా సంస్థ సౌజన్యంతో పేద బడుగు బలహీన వర్గాలకు ఉపయోగపడే బీమా పథకాలపై అవగాహన కల్పిస్తామన్నారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన


పీహెచ్‌సీలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడిమర్రి: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ధర్మవరం యువర్స్ ఫౌండేషన్ సహకారంతో కంటి వైద్యాధికారి ఉరుకుందప్ప, కంటి వైద్యులు సుబ్బారావు, జయరాం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 60 మందికి కంటి పరీక్షలు చేయగా.. 26 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారిని బస్సులో కర్నూల్ నగరంలోని శ్రీచక్ర కంటి ఆసుపత్రికి తీసుకెళ్లి శస్త్ర చికిత్సలు చేయించి, తిరిగి ఆదే బస్సులో ఇక్కడికి తీసుకుని వచ్చి వదులుతామని వైద్యాధికారి మహేంద్రనాథ్ తెలిపారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లప్పగారి మాధవరెడ్డి ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు వైకే శ్రీనివాసులు, కార్యదర్శి సుకుమార్, కోశాధికారి రాధాకృష్ణ, ఎంపీఈఓలు మనోహర్‌బాబు, నారాయణస్వామి, ఆరోగ్య కార్యకర్తలు జానకీరామ్, హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

తలుపుల: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలని ఎంవీఐ వరప్రసాద్ సూచించారు. సోమవారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఆటో, జీపు, ద్విచక్ర వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్, రికార్డులు తప్పనిసరిగా తమ వద్ద ఉంచుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దని సూచించారు. సీటు బెల్ట్ ధరించాలని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్‌లో మాట్లాడకూడదని హెచ్చరించారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

ధర్మవరం అర్బన్: రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలని బ్రేక్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్, వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్‌బాషా సూచించారు. జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఆటో, ట్యాక్సీ డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలన్నారు. సురక్షిత ప్రయాణమే శ్రీరామ రక్ష అని వివరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ ఎస్‌ఐలు మహమ్మద్‌రఫి, శేషగిరి, ట్రాఫిక్ ఏఎస్‌ఐ పురుషోత్తంగౌడ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంవీఐ వరప్రసాద్

సుభాష్ చంద్రబోస్‌కు నివాళి

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బస్ షెల్టర్ వద్ద సోమవారం సుభాష్ చంద్రబోస్ జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు పోతులయ్య, రంగనాయకులు తదితరులతో కలసి ఎస్‌ఐ హేమంత్ కుమార్ నేతాజీ చిత్రపటానికి నివాళులర్పించారు.

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లయోల పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ 126వ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ శంకర్‌నాయుడు, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నం అరవింద్, ఆర్‌ఎస్‌ఎస్ విభాగ్ సభ్యులు పాల్గొన్నారు.


సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

'స్పందన'ను నిర్లక్ష్యం చేయొద్దు

బత్తలపల్లి: ప్రతి సోమవారం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయవద్దని తహసీల్దార్ యుగేశ్వరిదేవి అధికారులను హెచ్చరించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచి ఆరు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. వెబ్‌ల్యాండ్‌లో నమోదు చేయాలని మూడు, రస్తా సమస్యలపై రెండు, రోడ్డు నిర్మాణంతో భూమి కోల్పోతున్న రైతులకు పరిహారం పెంచాలని ఒక్క అర్జీ అందినట్లు వివరించారు. సమస్య పరిష్కారం కాకపోతే ఎందుకు కాలేదో వివరణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాయి మనోహర్, ఏపీఓ ఆదెప్ప, ఏపీఎం సుదర్శన్‌రాజు, ఇంజనీర్ రమణయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరలక్ష్మి, ఏఓ ఓబిరెడ్డి, పశు వైద్యాధికారి గుర్నాథరెడ్డి పాల్గొన్నారు.